పల్లె పండగ పైసలెక్కడ?

- నెలలు గడుస్తున్నా అందని బిల్లులు
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు
- వడ్డీలకు వదులుతున్న చేతి చమురు

కర్నూలు(రూరల్): పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రయోజనం చేకుర్చడంలో టీడీపీది అందె వేసిన చెయ్యి. అధికారంలో ఉన్నన్నాళ్లు తమవారికి అన్ని విధాలుగా లబ్ధి చేకూరేలా కార్యక్రమాలు రూపొందిస్తారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పనులు వారికే అప్పగిస్తుంటారు. ఈ క్రమంలో ప్రభుత్వం చేపట్టిన ‘పల్లె పండుగ’ కార్యక్రమం కింద గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించి ఎంతో కొంత వెనకేసుకోవచ్చని, ప్రభుత్వం తమదే కాబట్టి పనులు పూర్తయిన వెంటనే బిల్లులు వస్తాయని కూటమి పార్టీల నేతలు భావించారు. అయితే వారి ఆశలన్నీ అడియాసలయ్యాయి. ముడుపులు పెట్టి పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాలేదు. ఎప్పుడు వస్తాయో కూడా తెలియక లబోదిబోమంటున్నారు. ఆదాయం వస్తుందని ఆశపడి వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు చేశామని, ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరిగిపోయి అప్పుల భారం కుంగదీస్తోందని వాపోతున్నారు.


పంచలింగాల బీసీ కాలనీలో రూ.17 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

టీడీపీ నాయకులకే పనులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పెద్దలు తమ కార్యకర్తలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి సారించారు. అందులో భాగంగా పల్లె పండుగ పేరుతో గత నవంబర్‌లో ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేసి సీసీ రోడ్లు, కాలువల పనులు అప్పగించారు. కర్నూలు మండలంలో మొదటి విడతలో రూ.2.05 కోట్లతో 24 పనులకు అనుమతులు పొందారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు పంచాయతీ సర్పంచ్‌లు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అధికారులపై ఒత్తిడి చేసి టెండర్ విధానంలో చాలా చోట్ల టీడీపీ నాయకులే పనులు చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి బిల్లులు మంజూరు చేయించుకొని కొంత ఆదాయం పొందవచ్చనుకున్నారు. కొంతమంది వద్ద పెట్టుబడి లేకపోయినా అప్పులు తెచ్చి మరీ పనులు చేశారు. నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు రాలేదు. దీంతో టీడీపీ నాయకలు అధికారుల చూట్టు తిరుగుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలోనే బిల్లుల చెల్లింపులో ఇంత ఆలస్యం జరిగితే భవిష్యత్తులో పనులు ఎలా చేయగలమని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తర్వలోనే బిల్లుల చెల్లింపు



పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, కాలువలకు సంబంధించిన పనుల బిల్లులు అప్‌లోడ్ చేశాం. బిల్లులు మంజూరు కాగానే పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేస్తాం. ఇప్పటివరకు ప్రారంభం కాని పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ముక్తార్ బాషా, పీఆర్‌ఏఈ, కర్నూలు మండలం

మండలంలో పల్లె పండుగ పనుల వివరాలు

కర్నూలు మండల పరిధిలో పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.2 కోట్లతో 24 పనులు చేసేందుకు అనుమతులు పొందారు. కొంతకాలం తాత్సారం జరిగినా టీడీపీ నాయకులు పనులు చేశారు. మొత్తం 24 పనులకు రూ.60 లక్షలు బిల్లులు చెల్లింపులు చేశారు. బకాయిలు రూ.1.40 కోట్ల బిల్లులు ఇంకా మంజూరు కాలేదు.

అలాగే రెండవ విడత కింద రూ.1.10 కోట్ల నిధులతో 9 పనులు మంజూరు కాగా 6 పనులు పూర్తిచేశారు. 3 పనులు ఇంకా ప్రారంభం కాలేదు. రెండవ విడత పనులకు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా బిల్లు మంజూరు కాలేదు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


మాట్లాడుతున్న క్వాలిటీ కంట్రోల్ డీఈఈ రవీంద్రరెడ్డి

కోడుమూరు రూరల్: పంచాయతీ రాజ్ శాఖ కింద జరిగే ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలుండేలా అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ రవీంద్రరెడ్డి ఆదేశించారు. మంగళవారం కోడుమూరులో సబ్ డివిజన్ సిబ్బందితో డీఈఈ పనుల నాణ్యతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో చేపట్టే ప్రతి పనిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించడంతో పాటు, నాణ్యత ప్రమాణాలు స్వయంగా పరిశీలించాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఎవరైనా పనులు చేస్తే వెంటనే నిలిపేయాలని సూచించారు. సమావేశంలో పీఆర్ డీఈఈ కర్రెన్న, క్వాలిటీ కంట్రోల్ ఏఈ విజయభాస్కర్, కోడుమూరు ఏఈ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మారెమ్మ దేవరకు సర్వం సిద్ధం


తిమ్మందొడ్డిలో కొలువైన మారెమ్మ

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో బుధవారం నిర్వహించనున్న మారెమ్మ దేవరకు సర్వం సిద్ధం చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ దేవత దేవర ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అదేవిధంగా బుధవారం వేకువ జామున నిర్వహించాల్సిన కుంభం కాగు ఏర్పాట్లను సైతం పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ తిమ్మారెడ్డి గ్రామంలో పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

ఎన్డీఏ నాయకుల సమావేశం


ఎన్డీఏ నాయకులతో సమావేశమైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు

కర్నూలు(రూరల్): జిల్లా ఎన్డీఏ నాయకుల సమావేశం కర్నూలులోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. జిల్లాలోని కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

మూల పెద్దమ్మ ఆలయంలో భక్తుల సందడి

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారి జాతర రెండో మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ రామలింగ రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ


ఆలయ ధర్మకర్తకు వెండి కిరీటం అందిస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న శ్రీ జంబులాపరమేశ్వరి అమ్మవారికి పాణ్యం గ్రామానికి చెందిన యశ్వంత్ వెండి కిరీటం బహూకరించారు. అడ్వకేట్ ఆకుల రామకృష్ణ జ్ఞాపకార్థం అందజేసినట్లు వారు వెల్లడించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయాధికారులు పూజలు చేయించి శేషవస్త్రాలు అందించారు.

కుందూలో గుర్తు తెలియని శవం

పాణ్యం: మండల పరిధిలోని అనుపూరు గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న కుందూనదిలో ఓ గుర్తు తెలియని శవం లభించింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 25–30 మధ్య ఉంటుంది. శరీరంపై ఎర్ర టీషర్ట్, నల్లప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడి చేతి పైన ఆంజినేయస్వామి ట్యాటు ఉందని ఆచూకీ తెలిసిన వారు సెల్: 9121101096కు సంప్రదించాలని ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.

పేదల ఇళ్ల పట్టాల రద్దు అన్యాయం

ఓర్వకల్లు: గత ప్రభుత్వం మండలంలోని నన్నూరు గ్రామంలో రెండో విడతలో పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలను కూటమి సర్కారు రద్దు చేయడం అన్యాయమని సీపీఎం నాయకులు అన్నారు. మంగళవారం లబ్ధిదారులకు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, నన్నూరు శాఖ కార్యదర్శి మధుసూదన్ విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామంలో సుమారు 800 మందికి రెండో విడతలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్లాట్లను రీవెరిఫికేషన్ పేరుతో రద్దు చేయడాన్ని పూనుకుందన్నారు. పేదలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే మరోచోట ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు. లేదంటే గ్రామంలోని పేదలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బింగుమల్ల శ్యాంసుందర్

నంద్యాల(వ్యవసాయం): 2025–26 సంవత్సరానికి నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్త మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఆదేశాల మేరకు ఈ అధ్యక్ష పదవి చేపట్టడం జరిగింది అన్నారు.

రసవత్తరంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు


పోటీలలో తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో మంగళవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా దాతల సహకారంతో నిర్వహించిన ఈ పోటీలలో మొత్తం 20 జట్లు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన జట్లకు తొలి ఐదు స్థానాలకు గాను వరుసగా రూ.30,016, రూ.20,016, రూ.15,016, రూ.10,016, రూ.5,016 చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలకు కబడ్డీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, పీఈటీ శ్రీనివాసులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ గ్రామంలో కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే గౌరు చరితా ప్రారంభించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు. అలాగే పిన్నాపురంలో బండలాగుడు పోటీలు ప్రారంభించారు. అనంతరం క్రీడా పోటీలను తిలకించారు.

ఎక్సైజ్ సుంకం పేరుతో ధరల పెంపు తగదు


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు కల్చరల్: ఎక్సైజ్ సుంకం పేరుతో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం తగదని, పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ ఓల్డ్‌సిటీ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఓల్డ్‌సిటీ ప్రధాన కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణితో ధరలను విపరీతంగా పెంచుతోందని ఆరోపించారు. పెంచిన ధరలు తగ్గించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం ఉపాధ్యక్షుడు డి.కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మహిమూద్, నాగరాజు, నూర్, కృష్ణ, రామకృష్ణ, సురేష్, నాసిర్, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి

పెంచిన గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని సీపీఎం కార్యవర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ.50 పెంచడం దారుణమన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ. 908కి చేరిందన్నారు. ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తుందన్నారు. సీపీఎం నగర నాయకులు జయమ్మ అధ్యక్షతన జరిగిన ధర్నాలో నాయకులు చాంద్ భాష, ఇలియాజ్ జహంగీర్, రాజు, శాలి భాష తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు



ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

11న బీసీ సమరభేరి


పోస్టర్లను విడుదల చేస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): బహుజన్ సమాజ్ పార్టీ, బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బీసీ సమరభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఎస్పీ నగర కన్వీనర్ రాజ్‌కుమార్ అంబేడ్కర్ చెప్పారు. సమరభేరికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక బీసీ భవన్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ నడిమింటి బోయ రంగయ్య, సీనియర్ బీసీ నాయకులు టీ.శేషఫణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని 11న ఉదయం 10 గంటలకు స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 110 కులాలుగా ఉన్న బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కలిపించాలన్నారు. నేతలు రామాంజనేయులు, రవి, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గిగ్ కార్మికుల వివరాల నమోదు


కార్మికుల వివరాల నమోదును పరిశీలిస్తున్న జేసీఎల్ బాలునాయక్

కర్నూలు(అర్బన్): అసంఘటిత రంగాలు, గిగ్ కార్మికులను ఈ– శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియలో భాగంగా మంగళవారం స్థానిక అమెజాన్ సంస్థలో పనిచేస్తున్న గిగ్ కార్మికుల వివరాలను నమోదు చేయడం జరిగిందని కర్నూలు జోన్ సంయుక్త కార్మిక కమిషనర్ యం.బాలు నాయక్ తెలిపారు. ఈ – శ్రమ్ పోర్టల్‌లో కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకుంటే సామాజిక భద్రతతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక ప్రయోజనాలు పొందేందుకు వీలవుతుందన్నారు. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జోన్ పరిధిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి కార్మికుల పేర్లను నమోదు చేయిస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలతో తమ పేర్లను నమోదు చేసుకున్న అనంతరం రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ లింకు అయిన మొబైల్ నెంబర్, పాన్‌కార్డును అందించాల్సి ఉందన్నారు. కామన్ సర్వీస్ సెంటర్లు, గ్రామ/ వార్డు సచివాలయాలు, సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయాల్లో కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఉప కార్మిక కమిషనర్ కే.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశన్న తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్ఓడీలు, ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని ఎన్టీఆర్ వైద్యసేవ పథకం పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ–హాస్పిటల్‌ను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓపీ, ఐపీ, డిశ్చార్జ్ డేటాను ఈ–హాస్పిటల్‌లో నమోదు చేయాలన్నారు. క్యాజువాలిటీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తర్వాతే వార్డులకు రెఫర్ చేయాలన్నారు. ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఆసుపత్రిలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, వైద్యులు పాల్గొన్నారు.

శిశువులకు వెయ్యి రోజుల వరకు ప్రాధాన్యత

కర్నూలు(అర్బన్): శిశువులకు మొదటి వెయ్యి రోజులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల సూచించారు. కర్నూలు ప్రాజెక్టు పరిధిలో మంగళవారం పోషణ పక్వాడ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ నిర్మల మాట్లాడుతూ.. పోషకాహారం, ఆరోగ్యంపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. జిల్లాలో 1886 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. శిశువుల ఆరోగ్యంపై మొదటి వెయ్యి రోజులు శ్రద్ధ వహించుట, లబ్ధిదారులు స్వయంగా నమోదు చేసుకునే విధానంపై ప్రచారం, కమ్యూనిటీ సహకారం ద్వారా పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, పిల్లల్లో ఉబకాయాన్ని తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవనశైలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పీడీ వివరించారు. కర్నూలు ప్రాజెక్టు సీడీపీఓ అనురాధ, సూపర్‌వైజర్లు అనూష, వరలక్ష్మి, మాణిక్యమ్మ, చౌతిమ, జమీలాబీ తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్, ఇంధన ధరలు తగ్గించాలి

కర్నూలు కల్చరల్: వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.200 తగ్గించి ఓట్లు వేయించుకొని మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకు ఇచ్చిన మాటలను గాలికొదిలేసిందని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలు, బడా పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేస్తూ పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. పేద ప్రజలు వాడుతున్న ఉజ్వల గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నగర అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

సి.బెళగల్: మండలంలోని మారందొడ్డి గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా సాగాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఎనిమిది జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. 15 నిమిషాల వ్యవధిలో రైతు సంఘం నిబంధనలకు లోబడి బండను ఎక్కువ దూరం లాగిన ఎద్దులను విజేతలుగా ప్రకటించారు. ఇతర ప్రాంతాల నుంచి బండలాగుడు పోటీలకు వచ్చిన రైతులకు భోజన వసతిని గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు కల్పించారు.

సత్తాచాటిన పెద్దనేలటూరు వృషభాలు

బండలాగుడు పోటీలలో రాయపురం గ్రామానికి చెందిన నల్లారెడ్డి, ఇందువాసికి చెందిన వీరేష్‌గౌడ్ సంయుక్త ఎద్దుల జత విజేతగా నిలిచాయి. నిర్ణీత 15 నిమిషాల సమయంలో రాతిదూలాన్ని 3,777 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.40 వేలు గెలుచుకున్నాయి. అలాగే కోడుమూరు మండలం వెంకటగిరికి చెందిన బీఎల్‌కే మొదటి ఎద్దుల జత 3,766.5 అడుగులు దూరం లాగి రెండవ స్థానంతో రూ.30 వేలను, ఈడిగావాని గ్రామానికి చెందిన వంశీకృష్ణ, అర్సెపల్లెకి చెందిన తిరుపతయ్య సంయుక్త ఎద్దుల జత 3,500 దూరం లాగి రూ.20 వేలను, కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన బీఎల్‌కే రెండవ ఎద్దుల జత 3,079 అడుగులు దూరం లాగి రూ.15 వేలను, బన్నూరుకు చెందిన దేవదాసు ఎద్దుల జత 2,565 అడుగుల దూరం లాగి రూ.10 వేలను గెలుపొందాయి. విజేతలకు గ్రామ పెద్దలు, ఉత్సవాల నిర్వాహకులు బహుమతులను అందజేశారు. కమిటీ సభ్యులు వడ్ల రాముడు, ఆంజనేయులు, కుమ్మరి లక్ష్మన్న, వీరన్న, ఉప్పరి లక్ష్మన్న, గిడ్డయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


పరుగు పందెంకు సిద్ధంగా ఉన్న యువకులు

ఉత్సాహంగా పోటీలు

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల గ్రామంలో శ్రీరామనవమి, శ్రీసవారమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన పరుగు పందెం, ట్రాక్టర్ రివర్స్, బండలాగుడు పోటీలు కోలాహలంగా సాగాయి. ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో మొత్తం 13 మంది పాల్గొనగా.. ఇదే గ్రామానికి చెందిన ధనుంజయరెడ్డి విజేతగా నిలవగా మధు, కిరణ్ తరువాతి స్థానాల్లో నిలిచారు. విజేతలకు ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు బహుమతులను అందించారు. అలాగే పరుగు పందెం పోటీల్లో 10 మంది పాల్గొనగా అమడగుంట్లకు చెందిన నవీన్‌కుమార్, జయక్రిష్ణ, ఎల్లక్రిష్ణ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున అమడగుంట్ల బ్రదర్స్ నగదు బహుమతులను అందజేశారు.


బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

అలాగే వృషభాల బండలాగుడు పోటీల్లో ఐదు జతల ఎద్దులు పోటీ పడ్డాయి. ఇదే గ్రామానికి చెందిన బోయ పెద్ద గోపాల్ ఎద్దులు నిర్ణీత సమయంలో బండను 3950 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచాయి. అలాగే బాలమద్దిలేటి ఎద్దులు 3467 అడుగుల దూరం బండను లాగి 2వ స్థానంలో, ఉస్మాన్‌బాషా ఎద్దులు 3157 అడుగుల దూరం బండను లాగి 3వ స్థానంలో గెలుపొందాయి. విజేత వృషభాల యజమానులకు దాతలు రూ.8 వేలు, రూ.5016, రూ.3016 నగదు బహుమతులను అందజేశారు.

పోషకాహారంపై అవగాహన పెంచాలి


పోషకాహారాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): మహిళలకు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన పెంచాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ సూచించారు. ఆమె మంగళవారం కల్లూరులోని 9వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న పోషకాహార పక్షోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోషకాహార పక్షోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో ప్రజలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. దీనివల్ల మాతాశిశు ఆరోగ్యం మెరుగుపడి మాతాశిశు మరణాలు నివారించవచ్చన్నారు. సీడీపీఓ అనురాధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

13 నుంచి శ్రీమద్రామాయణ మహాయజ్ఞం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు శ్రీమద్రామాయణ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం మంత్రి టీజీ భరత్ తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో విశిష్టమైన మహాపండితులచే సంపూర్ణ సంస్కృత శ్రీమద్రామాయణ పారాయణం, రామాయణ మూల మంత్రాలతో యజ్ఞం, ప్రవచనాలు ఏర్పాటు చేశామన్నారు. గోదా గోకులం సభ్యులు పెరుమాళ్ల బాల సుధాకర్, చిత్రాల వీరయ్య, కంభం కృష్ణయ్య, గోవిందరాజులు, సురేష్, మాకం శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ప్రకాష్, రవి పాల్గొన్నారు.